
# ఎర్రమందార



రచన: శ్రీ ఏ. వి. శీతారామమూర్తి.

[మానవుడికి మమతలు పెంచుకోవడమే గాని త్రెంచుకోవడం సులభంగా సాధ్యమయ్యే పనికాదు.
ఒక మానవుడు మరియొకని బాధను దూరం చేద్దామనుకుంటాడు. జీవకోటిలో ప్రేమ కొద్దీ— సలహాలిస్తాడు— ఆనందించమంటాడు.
ఆ మాటలు ఎదుటివ్యక్తి పాటించినప్పుడే ఆనందం సంతృప్తి!]

మానవాతీతమైన ప్రవాహాల్లా డీజిలింజను వేగంగా దూసుకుపోతూంది. ఏ కాలమైనా చెదరక బెదరక స్థాణువుల్లా నిలబడ్డమానులు, చెట్లు, ఎన్నో ప్రకృతి రమణీయ పరికరాలు పేదవాని ఆశల్లా వెనుకంజు వేస్తున్నాయి. ఐకమత్యాన్ని మానవజాతి ఎన్నటికీ పాటించలేదన్న మచ్చను మాపుతున్నాయి బారులు తీర్చిన పక్షులు!

కాలానుగుణంగా మారిపోయే మానవులతోను మరిచిపోయే మమతలతోనూ నాకిక పనిలేదన్నట్టు కావేరీనది ప్రవహిస్తూంది. పూర్ణిమనాటి వెన్నెలలా ఆడబాని నవ్వులా గలగలమని పారే నదిలో నురుగు తెల్లగా నాట్యం చేస్తూంది.

దూరానికి సన్నగా కనులకింపుగా కనుపించే పర్వతాలు వెనుకకు మరలిపోతున్నాయి.

రైలాగింది. నిరీక్షిస్తున్న గమ్యస్థానం కంటిముందు నిల్చింది. ప్రతి పర్యాయమూ కలకల లాడుతూ కంటికింపుగావుండే ఆ స్టేషను ప్రమోదువారి, నిర్జీవంగా... ఎండిన సెలయేరులా కన్పించింది. నిజానికెంతో అభివృద్ధి చెందినా, గోపాలాని బీటలు వారిన హృదయాని కది అంతేననిపించింది. జనాన్ని గుంపులు గుంపులుగా

దింపిన రైలు ఒక్కసారిగా శక్తిని పుంజుకుంటూ పురోగమించింది. వాతావరణం అలజడిగావున్నా మూగబోయిన గోపాలం మనసు మూగగానే నడచింది.

రిక్షా జోరుగా పోతూంది. దూరంగా మేడలతో పూరుముచ్చటగా వజ్రాలు పొదిగినట్లు కనబడుతూంది. గోపాలం దృష్టి ప్రకృతిని పరిశీలిస్తుంది. రిక్షావాడు చాలా ప్రయాసతో ముందుకు పోతున్నాడు. వాని పిక్కలపై నరములు త్రాళ్ళలా పెనవేసుకున్నాయి. ఒక మానవుని శక్తి... రెండవవాని సుఖానికి అంకితమౌతూంది!

బ్రతుకనే బాటలో పయనించే జీవి ఎన్నో అవాంతరాలు యెదుర్కొనవలసి వస్తుంది. 'ధనమూలం మిదం జగత్' పెద్దలాడినమాట పూరికనే పోదనిపించింది.

మూగబోయిన యింట్లోకి మూగగా నడిచాడు గోపాలం. మధురాన్వితమై... తేనెలొలికే ఆహ్వానము అతనికిప్పుడు లేదు. మానసికాందోళనను మాటలతో మరిపింపజేశే మానవాకారం మరుగైవదాగృహంలో. అనురాగ ఆనందాలు గోచరించిన ఆ యిల్లు అంధకారమయంగా తోచింది.

'ఎప్పుడోయ్ రావటం! కులాసాయేనా.' బావగారి మాటలకు బదులు చెప్పాడు. అతని కనుదోయిలో తీరని బాధ, హృదయంలోని ఆరనిమంట, మాటలలోని నిర్లిప్తత, సూక్ష్మంగా మానవత్వాన్ని అవగాహనం చేసుకొనే ఏ మానవునికైనా కంటికి కట్టినట్లగపడతాయి.

కాలచక్రపు భ్రమణంలో ఎన్నో ఆశయి కొట్టుకుపోతాయి.

అదే భ్రమణంలో యెన్నో నూతన కలయికలు, బాంధవ్యాలు ముడివడిపోతాయి!!

మాతృత్వపు ఎడబాటును కన్పింపనీక కలకాలం కళ్ళల్లో పెట్టి కాపాడే అక్క...! నేటి యీ మానవలోకంతో తెగితెంపులు చేసికొని దూరంగా ఎక్కడో వున్న స్వర్గాన్ని చేరుకుంది! యిహలోకంలో ఆమె యేకైక కోర్కె...తమ్ముని పెంచి, పెద్దచేసి- మానవుల్లో మానవుడిగా- రత్నాల్లో రత్నంగా- చేసి ప్రపంచానికందివ్వాలనేదే' అదే ఆమె తీర్చుకు పోయింది-

కాలచక్రం క్రమం తప్పక కదుల్తూంది. అక్కపోయి ఆర్నెల్లయింది. ఇంటివెనుక తోటలో వసంతాలు ఎండకెండి అందాలు బాసినాయి.- అక్క అభిమానమూ, ఆదరణా, ఆప్యాయత, అభిరుచి అన్నీ కలసి ఆ ప్రాంతంలో జ్యోతులై నిలిచేవి!

కానీ... ఆ జ్యోతులన్నీ ఒక్కుమ్మడిగా ఆరిపోయి పొగలుగామారి గాలిలో కలసి తేలిపోయాయి! చిక్కటి చీకటిలో కనీసం ఆ కాంతులు వెలువడ్డ స్థలాలైనా కానరాకున్నాయి.

అక్క ఆనందానికీ, అభిమానానికీ ఆలవాలమైయుండే పావురపుగూడు ఎండుటాకులతో నిండి, చెత్తపడి, కళావిహీనమై పోయినది. నూతిప్రక్క ముచ్చటగా పర్ణశాలల శోభలొలికే గూడు మచ్చుకైనా ఆనాటి కాంతులను ప్రసరింపజేయుటలేదు-

మగపావురము జాలిగా-లీలగా-ఓర్పుతో దీనంగా కదిలింది. ఆడదాని జాడలేదు. బహుశ అది కాలచక్ర భ్రమణంలో కొట్టుకొనిపోయి వుండవచ్చును. నిరాశతో ఎండుటాకులావున్న ఆ జత వీడిన పావురము ప్రస్తుతము భూమిపై బంధిగా గోచరించింది

అక్కకు పావురపు జంట అంటే ఎంతో ఇష్టం. సంధ్యా సమయంలో అక్క వాటిని ఆదరంతో చూసే సరికి ఆనందంతో ఆహ్వానించేవి! ఆ మూగబాసలు, బాంధవ్యాలూ అర్థంకాని ఆవేదనలతో సతమతమయ్యేవి! ఆ నాల్గు కళ్ళూ నాల్గు వందలుగా ఎదురుచూసేవి!

మానవాళిలో ప్రేమ సౌందరములు పుంజుకున్న సంతోషము వాటిలో గోచరమయ్యేది!

పాపం!__ఆడుపక్షి!__ అక్కతోపాటే అయి వుంటుంది.

గులాబీ చేమంతులు కొంచెంవాడినా ఏపుగా పెరిగాయి. మందారమాత్రం బలహీనంగావుంది. అక్క ప్రాణం ఆ ఎర్ర మందార కుంకుమ రంగుతో నవపరిమళాలను చల్లగ వెదజల్లే ఆ మందారను అక్క ప్రాణప్రదంగా చూచుకొనేది!

సుకుమారంగావున్నా__బలహీనంగా - పెనుగాలికి అల్లల్లాడి, పిల్లగాలికి సోలిపోయి, ఎండకెండి వానకు తడిసి తనలోని మాధుర్యాన్ని మానవాళికి పంచాలన్న ఆశయంతో నిత్యమొక పుష్పాన్ని బహుకరించే ఆ లేత మందారపై అక్కకు అమితమైన మక్కువ. అక్కతప్ప

ఎవ్వరూ ఆ పుష్పాన్ని కోయరు. కోయలేరు! ఇప్పుడా పుష్పం ఎండకెండి రాలిపోవలసినదే! మామిడిచెట్టు మోడువారినది. కోకిలజాడలేదు. ఉడుతల రాజ్యం. తోట అడివిలా తోస్తూంది. పోషణలేదు. అక్కతో అంతరించిన ఆదరాభిమానాలు వాటికిక ఎన్నటికీ సోకవు.

గులాబీలు సున్నితంగా సుకుమారంగా మాధుర్యాలొలుకుతూ చూస్తున్నాయి. వింత వింత ఆకర్షణలు! నిజానికవి అక్కకు సరిపడవు- కారణం వాడికన్న ముళ్ళే- ఎంత అందమున్నా ఆకర్షణవున్నా కంటికి కనిపించక కష్టము కల్గించే వాటికి దూరంగా వుండాలంటుంది- అక్క.

మందారంలో ఏంతక్కువ? అందముంది! ఆకర్షణ వుంది! దాని వెనుక ఎటువంటి లోపాలూ గుచ్చి గుచ్చి చూడవు! అందుకే అక్కకవంటే అమితమైన ప్రేమ.

*  *  *

బావకూ తనకూ మూగగా మధ్య పదిరోజులు దొర్లుకుపోయాయి. బావలో అక్కను గురించిన ఆలోచనలింకా సమసిపోలేదు-మరచిపోని మాధుర్యాలు, మరపురాని ఆనందాలు.

మాసిపోని ఆదర్శాలు — ఎన్నో — బావను బంధీ చేశాయి.

మానవుల్లో 'మరపు' అందుకే సృష్టించాడు భగవంతుడు అనిపించింది.

పెళ్ళినాటి బావలోని గాంభీర్యత, వుత్సాహం, నేటి బావలో మచ్చుకైనా లేవు! కారణం- జీవిత సమభాగిని యొక్క తీరనిలోటే అనవచ్చును.

అక్క సంసారిక జీవితానికీ, ఏకాంత జీవితానికీ తేడా తేటతెల్లమౌతూంది! మధురానంద జీవిత పారవశ్యాలతో జీవించడానికే మానవకోటిలో యీ కళ్యాణమొక నిదర్శనము. పూర్వీకుల సూత్రప్రాయంగా గుణించి సుముహూర్తంలో సూత్రధారణ మొనర్చెదందులకే!

బావగారి తీవ్ర ఆలోచనలకు అక్క ఒక ముఖ్య కారణము. అక్క కనుమరుగే బలమైన నాంది.

సహృదయంతో నిస్వార్థపరులైన ఆ దంపతులను చూచి ఎంతో మురిసిపోయేవాడు గోపాలం!

నిజానికి అక్క ఎంత అదృష్టవంతురాలు! తన మనోభావాలకు సరిపోయే, వ్యక్తి-తన గౌరవాభిమానాలను పుంజుకుని పొందుపరచే వ్యక్తిని భర్తగా పొందింది!

ఒకొక్కసారి అనిపిస్తూంటుంది. భగవంతుడు ఏరికోరి మంచి ఫలాలనే ఎంచుకపోతాడు-అని-




ఫౌండ్రి సెక్షన్ బిల్డింగ్.



షాప్ & టూల్ రూం బిల్డింగ్.

1967 మార్చి నెలలో కోయమత్తూరుకు 19 వ మైలు దగ్గరవున్న కారుమడైలో మద్రాసు ఫోర్జింగ్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ప్రారంభించారు. వీరు సంవత్సరానికి 2400 స్టీల్ ఫోర్జింగ్సనూ 3600 టన్ లు స్క్రేప్ అయిరన్ కాస్టింగ్స్ చేయుదురు. దీనికి మూలధనం సుమారు ఒక కోటి రూపాయిలు. కోయమత్తూరులో ప్రసిద్ధిచెందిన సుబ్బయ్యా ఫౌండ్రి, జగా బటన్ ఇండస్ట్రీస్ వారు దీనికి భాగస్తులు.

అందానికి
ఆనందానికి
క్రిష్ కో షాపింగ్
SILVER JUBILEE
25TH year
1942 1967
ఫోన్ నెం. 33960
జి. బినేష్ మేకప్ సామానులకు
దక్షిణదేశ సోల్ డిస్ట్రిబ్యూటర్లు.
నెం: 331-333. రాసప్పశెట్టి వీధి
మదరాసు-3.
బ్రాంచి: ఫోన్ నెం: 441199.
నివాసస్థలం ఫోన్ నెం: 41133.

అక్కలోటు బావను నిశీథంలోకి దిగవిడిచింది. అతను మెలిగే నిశీథంలో అతననుభవించే అంధకారంలో ఒక వెల్గుకావాలి! ఒక జ్యోతి! కాంతిపుంజం! ఎంతైనా అవసరం.

ఆలోచన తళుక్కున మెరిసింది. కానీ-ఆ వెల్గు స్వచ్ఛంగా శాంతంగా వెలగాలి! పూర్వ కాంతిని జ్ఞాపకం చేయాలి!!

ఎప్పటికైనా మగవాని పతనానికీ పురోగమానికీ కారణ భూతురాలు ఆడది. అంతటి విశ్వ మానవ శక్తి ఆమెలో జీర్ణించుకొని వుంది.

మూగగా గడిచే రోజులమధ్య బావతో స్వల్ప సంభాషణ ఆరంభమయింది.

'బావా!' బరువుగా వచ్చిన రెండక్షరాలూ ఎంతో జాలితో చూశాయి. బావ తలెత్తి చూశాడు-నిరాశతో చింతతో-

'కొన్నాళ్ళగా నిన్నో ప్రశ్న అడగాలను కుంటున్నాను-అభ్యంతరమా?'

మౌనం కాలంలో కొద్దినిమిషాలు గడిచాయి-

'అభ్యంతరానికేమీ లేదుగాని ఒక్కటి మాత్రం నిజం! నీ ప్రశ్నకువచ్చే సమాధానం-బహుశ! నీకసంతృప్తిని కలిగించవచ్చు-'

'ఫరవాలేదు బావా! నిజానికి మానవాతీత ఆలోచనలు, అందుకోలేని ఆశలు, పెంచుకోవడంవల్ల మానవుడు సుఖాన్ని పొందలేడు.

అదే! నేను నీలో గమనించాను! ఆలోచించ దగ్గవి ఎన్నోవుండొచ్చు! కానీ నీ ఆలోచనలు వేరు!

నిజంగా అక్కా! నా ప్రాణంతో సమానంనా పాపపు మనస్సు ఆ పాతపుటలను తిరగేయ నారంభించింది. ఆ వేపుటలు- నీ జీవితంలో కదలికలేక నిల్చిపోయాయి! కారణం? నాలోని అల్పత్వమే నంటావా? కాదు-కాలేదు!! నే నామెను గూర్చి ఆలోచించి చేసేది లేదు-చేయలేనుకూడా! ఆమెకేనాడో మనతో సంబంధం తెగిపోయింది! అక్క తెగితెంపులు చేసికొన్న నీ జీవితగాలి గ్రద్దకు తగినసూత్రం అవసరమంటాను! లేకుంటే ఆధారంలేక అల్లల్లాడే గాలిగ్రద్ద తలక్రిందులై భూమికి దిగజారుతూ ఏ తీగలకో చుట్టుకొని భంగం కాక మానదు!

నీతులూ, ఉపదేశాలూ నీ అంతటివానికిచ్చే వయస్సూ జ్ఞానమూ నాలో లేకపోవచ్చును బావా!

నీలో కలిగిన బాధకు నా మనసు మరింత కరిగిపోతూంది! నీ యీ అంధకారానికి ఒక దీపం ఎంతైనా అవసరమంటాను-

బావలోని నిర్లిప్తత, ఏకాగ్రత ఏమాత్రం కదలిక చూపలేదు. కాలంలో మరికొన్ని నిశ్శబ్ద నిముషాలు మెత్తగా జారిపోయాయి-

'నాకుతెల్సు గోపాలం! నీవు చెప్పేది-నా ప్రాణమంతా మీ అక్కతోనే మిన్నంటి పోయింది! ఇక మిగిలిన యీ ఎముకలగూడు ఎవరికిఇచ్చి బాధపెట్టి మోసం చేయగలను చెప్పు! నిజానికి నాకా ఆలోచన లేదు. బహుశ వుండదుకూడా! కాని ఒక్కటిమాత్రం నిజం! మీ అక్కలోని అపూర్వగుణమైనాగల వ్యక్తి నెవరినైనా యీ కట్టె పరికించడం తటస్థిస్తే ఆకర్షిస్తే తప్పక నీవనుకున్నది జరుగుతుంది.

బావగొంతు బొంగురబోయి సన్నగిల్లింది.

తరువాత కొన్ని రోజులు మూగబోయి-

ప్రయాణ సన్నద్ధంలోవున్న గోపాలాన్ని విద్యలో పురోగమాన్ని ఆకాంక్షిస్తూ సాగనంపాడుబావా !

పాత చెట్లు. పూర్వపు ప్రకృతి దృశ్యాలూ మళ్ళీ కళ్ళముందు తిరిగిపోతున్నాయి. బావకి చేసిన ఉపదేశం తిరిగి గుర్తుకు రాసాగింది.

జీవితంకూడా ఒక రైలుబండి అయితే ఎంత బాగుం డుననిపించింది, చూచిన ప్రకృతీ పొందిన హాయీ తిరిగి చూచి అనుభవించే యోగ్యత వుండేది!

ఆలోచనాలతలు అంతం కాకముందే గమ్యస్థానం దరిజేరింది రైలు.

ప్రకృతిమాత ఒడిలో ఒరిగి వోలలాడే పల్లెలు ఎంతటి మహానగరానికైనా సాటి రావనిపించింది! కాలేజీ హాస్టల్ తిరిగి పూర్తి జనసంఖ్యను పుంజుకుం టూంది. పట్ట భద్రులై వెళ్ళిన విద్యార్థుల చూపులకు చిన్నబోయిన హాస్టలు వదనంలో చిరునగవులు లాస్యం చేయ నారంభించాయి.

సాటి కొత్త విద్యార్థులతోను, కాలేజీ జీవితం తోను, ఒకటిగ మెలిగే రూం మేట్సుతోను, వారగా సముద్రపుటలలను చూచు భాగ్యమిచ్చు మేడమీది గదితోను: దూరంగా - విధిగా తిరుగుతూ లాత్రులందు కాంతులు ప్రసరించే లైట్ హౌస్‌తోను, సమసంబం ధాలు యిట్టె పెంపొందించుకో గలిగాడు గోపాలం. ఇవిగాక - మానసిక బాధల నిట్టే మరపించే మహా శక్తిగల పుస్తక ప్రపంచంలో రెండేళ్ళు యిట్టే గడిపే శాడు -

× × +

ఆనాడు - సరిగా శనివారం - ఎందుకో త్వరగా లేచాడు! కాలకృత్యాలనంతరం స్నానంచేసి వెంకటే శ్వరుని సాన్నిధ్యానికి బయలుదేరాడు.

దీన జనపాలుడూ, కల్యాణచక్రవర్తి అయిన వెంకటేశ్వరుడు ఉదయకాల భక్తుల మొరలను విని, వారిచే కొలువబడుచున్నాడు. ఆ కొండ వుపరిభాగం నుండి కన్పించే దృశ్యాలు వర్ణనా తీతం.!

ఆ నిర్మల ప్రశాంత వాతావరణాన్నీ దూరంగా కనుపించే క్రైస్తవ దేవాలయాన్నీ ప్రక్కగా నిత్యమూ దేవుని పాదములను తాకుచున్నట్లుగా వుండే ఆ సముద్రాన్నీ చూచి అక్క ఒకప్పుడు ఎంతో ఆనందిం చింది. నగరాలు విలాసయోగ్యంగా భావించే అక్కకు యీ ప్రదేశం ఎంతో నచ్చింది! అప్పుడే ఆమె నగ రాన్ని చూడటం మొదటిసారి, అదే కడసారి కూడ!!

అంతటి మహాభక్తి గల శాంతమూర్తిని ఎందుకు దూరం చేసాడో యీ భగవంతుడనిపించింది. అదే అదేమునికలాడ అడిగిన ప్రశ్న —

టాగూర్ వాక్యం లీలగా మెదిలింది 'నీ కవసర మైతే నీ పూజకు యీ పుష్పాన్ని ఏరుకో లేనిచో దుమ్ములో పడి నశిస్తుంది!'

గతాన్ని గూర్చి మర్చిపోయే ప్రయత్నంలో వున్న గోపాలానికి ఆ సాయంకాల మొక కవరు! అదే అతని గతాన్ని మరింత త్రవ్వింది.

భావ...తన అక్కను మరచే ప్రయత్నంలో వున్నాడు. కానీ అదీ తన ఉపదేశమే! అక్క స్థానే బావ భావిజీవితాన్ని దిద్దగలిగే మరియొక స్త్రీ! తన ఉపదేశం... బావ నిర్లిప్త...తుది సమాధానం - మన సులో మెదిలింది. కల్లోలమైంది మనసు - అప్రయత్నం గానే బావకు శుభ కాంక్షలు పంపాడు!

ఆరు నెలలు గడిచాయి - బావదగ్గరనుండి చాల వుత్తరాలు వచ్చాయి. ఏ కొన్నింటికో బదులు రాశాడు. బావ వ్రాసే వుత్తరాల్లో తనవుపదేశా న్ననుసరించినట్లు ఎన్నో వ్రాశాడు! కవ జీవిత దీపానికి చమురును పోసిన వానిగా ఎంతగానో పొగిడాడు. ఆరోగ్యం గురించి హెచ్చరించాడు. కనీసం సెలవులకైనారమ్మని ప్రార్థ నా పూర్వకంగా వ్రాసేడు.

వేసంగి సెలవులలో బావను చూడాలని నిశ్చయిం చుకున్నాడు. బయలుదేరాడు. దారిలో మునుపటి ప్రకృతిలేదు. ఎంతగానో మారింది. స్టేషనులో క్రొత్తగా కేంటీనులో వెయిటింగ్ రూమూ ఉద్భవిం చాయి.

ఇల్లు కొంచెం నీటుగా వెల్లవేసిన గోడలతో కన్పిం చింది. బావముఖంలో ఆనందాలు వెల్లివిరిశాయి.

అతని అర్ధాంగి వదనంలో అక్కరూపాన్ని ప్రతి బింబింప చేయలేక పోయాడు గోపాలం.

ఇంటి వెనుక తోట మారింది. పావురపుగూడు క్రొత్తగా వుంది! ఆడపావురం క్రొత్తది కాబోలు వుంది. జంట పైకి అందంగానే కన్పించింది.

గులాబి ఏపుగా పెరిగింది - అక్కలేని పూలు పూచింది.! చేమంతి అంతే!

మందార ఎంత వెదకినా కన్పించలేదు. బావవల్ల తెల్సింది.

'ఎర్రమందార' చచ్చిపోయిందని - కళ్ళు చెమ్మ గిల్లాయి.